# అపరాధి

మార్కెట్‌లో కూరలు కొంటున్న ఆదిత్యంగార్కి నాల్గడుగుల దూరంలో మాధవరావు కన్పించి పలకరింపుగా నవ్వాడు.

"ఒంట్లో కులాసానా"? అన్నాడు ఆదిత్యం.

"ఆ, ఇప్పుడు బాగానే వుంది. ఏదో చిన్నపాటి అనారోగ్యానికే మావాళ్ళు హడావిడి చేశారు. అయిపోయినట్లేనా కూరలు కొనటం." అన్నాడు మాధవరావు.

"ఇదిగో మిర్చి - కరివేపాకు తెచ్చానంటే. ఒక్కక్షణం" అంటూవెళ్ళి కొనుక్కొచ్చాడు ఆయన.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

రిటైర్ అయ్యాక ప్రతీరోజు సాయంకాలం పార్కుకు వెళ్ళటం హాబీగా అలవాటు చేసుకొన్న ఆదిత్యంగార్కి అక్కడ పరిచయం అయ్యాడు మాధవరావు.

ఉన్నట్లుండి గాలిదుమారం రేగి ఆకాశం నిండా మబ్బులు కమ్మాయి.

"దీని దుంపతెగ మధ్యాహ్నం అంతా మండిపోయింది. ఇప్పుడీ మబ్బులు ఏమిటి?" అన్నాడు ఆదిత్యం.

"అందుకేకదండి అన్నారు వాన రాకట - ప్రాణం పోకట అనీ," అన్న మాధవరావు మాట పూర్తికాకుండానే చినుకులు కూడా మొదలయ్యాయి.

ఇద్దరూ ఓ కొట్టు దగ్గర నిలబడ్డారు.

గాలి విసురుకు బాగా తడిసిపోయారు.

తగ్గే సూచన లేని వాన మరింత వుధృతమయింది.

"లాభంలేదండీ దీని వాటం చూస్తుంటే తగ్గేటట్లుగాలేదు. మా ఇంటికి పోదాం రండి" అని రిక్షా పిల్చాడు మాధవరావు.

మసీదు రోడ్డుకి అయిదు రూపాయలన్నాడు వాడు.

"దగ్గరే కదయ్యా" అన్నాడు ఆదిత్యం.

"వర్షం కదయ్యా" అన్నాడువాడు.

"కానీండి. మనది అవసరం. - వాళ్ళది అవకాశం" అన్నాడు మాధవరావు.



ఆయన మాటకాదన లేని ఆదిత్యంగార్కి రిక్షా ఎక్క తప్పలేదు.

"అరే! నాన్నగారు పూర్తిగా తడ్సిపోయారే" అంటూ చేతిలోని కూరల సంచీని అందుకున్నాడు మాధవరావు కొడుకు వాసు.

"అత్తయ్య మీ గురించి తెగ ఖంగారువడుతున్నారు. తలతుడుచుకోండి మామయ్యా" అంటూ తువ్వాలందించింది కోడలు హేమ.

ఆ తువ్వాలు ఆదిత్యంకి అందిస్తూ " మీ బట్టలు కూడా బాగా తడిసి పోయాయి నా బట్టలిస్తాను. మార్చుకోండి" అన్నాడు మాధవరావు.

"అబ్బే ఎందుకండి ఫాన్ గాల్కి క్షణంలో ఆరిపోతాయి" అన్నాడు అదిత్యం తువ్వాలుతో తలను అద్దుకుంటూ.

ఆ ఇల్లుచూస్తుంటే మాధవరావు బాగా వున్నవాడే అన్పించిందాయనకు. తను చేస్తున్న వుద్యోగం గురించి ఆదిత్యంతో చెవుతున్నాడు వాసు.

పెద్దలఎడ గౌరవమన్న సూత్రం అతడి మాటల్ని బట్టి రుజావు చేస్తోంది.

వాసు చెవుతున్న మాటల మీద మనసున్నా ఆదిత్యం చెవులు మాత్రం లోవల జరుగుతున్న సంభాషణ మీదున్నాయి.

"వాను వెడతానంటే వద్దని మీరు బయలుదేరారు. చూడండి ఎలాతడిసిపోయారో ఇందాకట్నించి నా ప్రాణం ఎలావుందో తెల్సునా?"

తనపైటచెంగుతో భర్త తలను తుడుస్తోందామె.

మాధవరావు భార్య కాబోలు అనుకున్నాడు ఆదిత్యం.

"తడిస్తే ఏం ఫర్వాలేదులేవేయి" అన్నాడాయన.

"ఆ, మీరిలాగే అంటారు. తలమీద ఒక్క చినుకు పడినా మీకు పడదు."

"అమ్మాయి హేమా! ఆ కుంపటిలా తీసుకురా" అందామె కోడల్ని.

"సుభద్రా, ఇప్పుడిదంతా ఏమిటి, అవతల హాల్లో నా స్నేహితుడు కూర్చున్నాడు." అన్నాడు మాధవరావు.

కుంపట్లో గుప్పెడు సాంబ్రాణి వేసి భర్త తలకు వట్టేటట్లుగా చేత్తో జుట్టును నవరిస్తోందామె.

ఎందుకో, మాధవరావు అదృష్టవంతుడు అన్పించింది ఆదిత్యానికి. రెండు గ్లాసుల నిండుగా మిరియాల పొడి వేసిన పాలతో వచ్చాడు మాధవరావు.

"చూశారా! మావాళ్ళ హడావిడి" అన్నాడు ఆదిత్యంకి గ్లాను అందిస్తూ. అనంతరం కుటుంబ సభ్యుల్ని పరిచయం చేశాడు.

మాధవరావు భార్యను చూస్తూనే స్థాణువయ్యాడు ఆదిత్యం.

ఆమె పేరును అస్పష్టంగా పలికాయాయన పెదవులు.

అవిడ ముఖం కూడా పాలిపోయింది.

"నే చేసుకున్న అదృష్టం ఆదిత్యంగారు - ఈ ఇంట్లో నామాటకు ఎదురులేదు. గొప్ప చెప్పటంకాదుకానీ, మా సుభద్రకు నేనంటే ప్రాణం. నా కాల్లో ముల్లు దిగినా భరించలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ సిరి అంతా కూడా ఆమెను పెళ్ళాడాక నాకు వచ్చిందే".

మరక్కడ వుండలేనట్లుగా లోవలకు వెళ్ళిందావిడ.

తను ఆనందంగా వుండటమే కాదు తనవారికి కూడా ఆనందాన్ని కల్గచేస్తోంది సుభద్ర.

అదృష్టాన్ని ఎవరూ చెరవలేరు.

తల్లిపోలికలే పిల్లలకు వస్తాయి.

మాధవరావు ఏదో చెపుతున్నా ఆదిత్యం దృష్టి అక్కడలేదు. మనసంతా అదోలా వుంది.

"వస్తానండి వర్షంవెలిసింది" అన్నాడు.

తన స్కూటర్ మీద డ్రాప్ చేస్తానన్నా వద్దని వారించి ఇంటికి బయలు దేరాడాయన.

నందనవనంలా వుంది సుభద్ర కాపురం.

అన్యమనస్కుడిగా నడుస్తున్న ఆయన వెనకనుంచి సైకిలు తాకటంతో ఒక్కసారి బోర్లాపడ్డాడు. చేతినంచిలోని కూరలన్నీ చెల్లాచెదురయ్యాయి.

బొటనవేలు బాగా చితికింది. మోచేతులు రెండూదోక్కుపోయాయి.

నీళ్ళలో పడటంతో బట్టలు మళ్ళా తడిసిపోయాయి.

మెల్లగా లేచి కూరలను సంచిలో వేసుకొన్నాడు.

సైకిలు కుర్రాడెప్పుడో పరారయ్యాడు.

గడపలో కాలు ఎలా పెట్టాడో ఆయనకే తెలియదు-

"అనుకుంటునే వున్నాను. తడిసి వస్తారని. ఏంకొంపమునిగిందిట కాసేపు ఎక్కడన్నా నిలబడకూడదూ" అంది భార్య లలితమ్మ.

"నిలబడితే ఎట్లా? మళ్లీ ఏదన్నా రోగం వస్తేనాకు డాక్టర్ ఫీజులు అవద్దూ" అన్నాడు అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన పెద్ద కొడుకు వ్యంగ్యంగా.

"అదేం అంటే మీరేగా కూరలు తెమ్మన్నారు. వెళ్ళి తడిశాను అంటారు ఆయనకేం, మాటలురావా"? అంది కోడలు.

"అమ్మా! నాన్న పడ్డట్టున్నాడే. కాలి వేలు చితికింది" అన్నాడు వెకిలిగా నవ్వుతూ రెండోకొడుకు.

"పడకేంచేస్తారు. అసలాయన చూపుభూమి మీద వుంటేగా"? అంది లలితమ్మ.

మౌనంగా కూరల సంచి వంటగది పక్కనుంచి బట్టలుమార్చు కుందుకి వెళ్ళాడాయన.

తలతుడుచుకుంటున్న ఆయనకు ఎంత వద్దనుకున్నా—

తన కొంగుతో భర్త తలను తుడుస్తున్న సుభద్రగుర్తుకు రాసాగింది.

సుభద్ర భర్త దగ్గర ఎంత ఆనందంగా వుంది.

తనూ వున్నాడెందుకు అనుక్షణం ఈటెల్లాటి మాటల్తో మధనపడుతున్న మనసుతో.

భర్త అన్న అభిమానం, ప్రేమ తన భార్యకుంటే కదా-తండ్రన్న అభిమానం, ఆప్యాయత తన పిల్లలకుండటాన్కి పెళ్ళినాడు 'డబ్బు తెచ్చానన్న గర్వమే' లలిత చేతలా పలికిస్తోందేమో.

ఆ రాత్రి మనసు కలతచెంది భోజనం వద్దన్న భర్తతో—

"బాగుంది ఈ అలక. అలిగి ఎవర్ని వుద్ధరిస్తారు. కడుపులో మాడితే మీరే వస్తారు"



అని తేలికగా తీసిపారేసిందే తప్ప కారణం అడగటాన్కి మాత్రం ప్రయత్నించ లేదు లలితమ్మ.

ఆ మాటల్ని విని విరక్తిగా నవ్వుకున్నాడాయన. జీవితంలో ఏంపోగొట్టుకున్నాడో ఆలస్యంగా అయినా అర్థం అయింది.

ఒకే ఒక్కపొరపాటు చేశాడు.

అందుకు జీవితాంతం అనుభవిస్తున్నాడు.

ఈ అశాంతికి కారణం తనే.

మొదటిసారిగా తనచేత్తో తాళికట్టిన సుభద్రకు కట్నంతేలేదన్న నెపంతో, అబద్ధపు కారణాలు సృష్టించి విడాకులిచ్చి, లలితను రెండో భార్యగా తెచ్చు కోవటమే తను జీవితంలో చేసిన పెద్ద పొరపాటు.

స్వయంకృతాపరాధం అనుభవించక తప్పదు అనుకున్నాడాయన నిర్వేదంగా కళ్ళు మూసుకుని.

– మాడుగుల కృష్ణకుమారి